మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

14 మంది వైద్య సిబ్బందికి
షోకాజ్ నోటీసులు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఫార్మసిస్టుపై సస్పెన్షన్ వేటు

గద్వాల ప్రతినిధి జూన్ 18 ప్రభాతవార్త: కంటి సమస్యలతో వచ్చే పేషెంట్లకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు సిబ్బంది సమయ పాలన పాటించాలని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ వైద్య సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ప్రతి వార్డును సునిశితంగా పరిశీలించి అక్కడి పరిస్థితులు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్‌లు ఎంత మంది నిర్దేశిత సమయానికి వచ్చారని రిజిస్టర్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్‌లు ఎంత మంది నిర్దేశిత సమయానికి వచ్చారని రిజిస్టర్‌లో పరిశీలించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు 14 మందితో పాటు మరో నలుగురు వైద్య సిబ్బంది గురై హాజరు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తపరిచారు. ప్రతిరోజు వారి హాజరు వివరాలను తెలిపే బయోమెట్రిక్ యంత్రంలో గల వారి వివరాలను ప్రింటు తీసి ఇవ్వాల్సిందిగా ఇంచార్జి సూపరింటెండెంట్ కు కలెక్టర్ ఆదేశించారు. విధులను సరిగా నిర్వహించిన 14 మందికి షోకాస్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే ఫార్మసి స్టోర్ తనిచ చేసి స్టాక్ వివరాలు, రిజిస్టర్లు సరిగా నిర్వహించకపోవడం పట్ల ఫార్మసిస్టును వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించారు. కంటి వైద్య చికిత్సకు సంబంధించిన ల్యాబ్‌ను పరిశీలించి, కంటి సమస్యలతో వచ్చే పేషెంట్లకు వెంటనే మెరుగైన చికిత్సలు అందించే విధంగా అపరేషన్ థియేటర్‌ను జులై, 1 నుండి పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. 50 పడకల వార్డులో పేషెంట్లను పురుషులను అందులోకి షిఫ్టు చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్స్ నమోదు వివరాలు తెలిపే రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇంచార్జి సూపరింటెండెంట్ డా.నవీన్ , క్రాంతి, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఘనంగా బోనాల పండుగ

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మక్తల్‌రూరల్ జూన్18 ప్రభాతవార్త : మక్త ల్ దగ్గర దండు గ్రామంలో మారెమ్మ బోనాల పండుగకు స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొ ని ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామస్తులతో కలిసి అమ్మవారికి నిత్య పూజలు చేశారు. గ్రామంలో ప్రతి ఇంటి ఆడపడుచులు బోనాలు సమ ర్పించి అమ్మవారికి నైవేద్యం సమర్పిం చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు రవికుమార్, గ్రామస్తులు రాము, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొన్ని సంఘటనలు..

- గత నెల 28న షాద్‌నగర్‌లోని ఓ మండి హోటల్‌లో మ్యారేజ్ డే సందర్భంగా కుటుంబం మొత్తం కలిసి హోటల్‌లో బిర్యానీ తిందామని వెళ్లిన వారు ఆనారోగ్యం పాలయ్యారు. భోజనం వికటించి ఎనిమిది మంది అస్వస్థతకు గురయ్యారు. షాద్‌నగర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన కావలి నరేందర్,మంగమ్మ పెళ్లి రోజు సందర్భంగా హోటల్‌కు వెళ్లి తమ ఇష్టమైన బిర్యానీలు, ఇతర ఆహారం తిన్నారు. ఇంటికి వెళ్లిన వెంటనే వాంతులతో పాటు రక్తంతో కూడిన విరేచనాలు కావడంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరడంతో ఏకంగా బిల్లు లక్ష రూపాయల బిల్లు కావడం గమనార్హం.
- మహబూబ్‌నగర్‌లోని పిస్తాహౌజ్‌లో ఇదే నెల 8న ఫుడ్ సేఫ్టి అధికారులు తనిఖీ చేయగా కుళ్లిన మాంసం దొరకడంతో ప్రజలు అవాక్కయ్యారు. డ్రైనేజీలు శుభ్రం లేకపోవడంతోపాటు, అపరిశుభ్రంగా ఫ్రిజ్ ఉండడం గమనించారు. హోటల్‌లో లైసెన్స్ సైతం డిస్ప్లే చేయకపోవడంపై అధికారులు ఆరా తీశారు. సుమారు 70కేజీల నాన్‌వెజ్ ఐటమ్స్ దొరకడంతో వాటిని పరీక్షలకు పంపించారు.
- వనపర్తి జిల్లా కేంద్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. చాలా హోటళ్లలో స్టోర్ చేసిన ఫుడ్, నాన్‌వెజ్ దొరకడంతో జరిమానా విధించి నోటీసులు జారీ చేశారు. కనీస శుభ్రత లేకుండా ఫ్రీజర్లను ఉంచడాన్ని అధికారులు గుర్తించారు.

తనిఖీలు నామమాత్రమే..

వనపర్తిలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

ఫుడ్ సేఫ్టీ అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ చేతులు దులుపుకొంటున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో వారం రోజుల మాంసం ఫ్రీజర్లలో ఉంచి వడ్డిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కనీస ప్రమాణాలు లేకుండా యజమానులు వ్యాపారం చేస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదు. ఇటీవల మహబూబ్‌నగర్‌లోని పిస్తాహౌజ్‌లోనే కిలోల మాంసం ఫ్రీజర్లలో దొరకడంతో భోజన ప్రియులు ఒక్కసారిగి అవాక్కయ్యారు.పేరున్న హోటళ్లలోనే నాణ్యత అంతా డొల్లా ఉంటే చిన్న చిన్ని హోటళ్లలో, స్ట్రీట్ ఫెడ్ సెంటర్లలో ఏంటి పరిస్థితి అని భయాందోళన చెందుతున్నారు. ఆహార భద్రత తనిఖీ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. మరోవైపు అధికారుల కొరత ఉండడంతో ఇక హోటల్ యజమానులు ఇష్టారాజ్యంగా నాణ్యాతా ప్రమాణాలు లేకుండా నిర్వహిస్తున్నారు.

- మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 18, ప్రభాతవార్త

- పత్తాలేని ఫుడ్ సేఫ్టీ అధికారులు
- అధికారుల కొరతతో హోటళ్ల యజమానుల ఇష్టారాజ్యం
- పిస్తా హౌజ్‌లోనే కుళ్లిన మాంసం దొరకొడంతో అవాక్కయిన ప్రజలు
- చిన్న హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లపై ఆందోళన..?
- లైసెన్సుల రెన్యువల్‌పై దృష్టి సారించని వైనం
- ఇకనైనా మేలుకొంటారా..

పిస్తా హౌజ్‌లో గుర్తించిన కుళ్లిన మాంసం (ఫైల్)

హోటళ్ల యజమానులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. తినే పదార్థాలు రుచిగా ఉండడమే కాదు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండడం కూడా అవసరమే. స్ట్రీర్ ఫుడ్ సెంటర్లే కాదు పెద్ద పెద్ద పేరున్న హోటళ్లలో కూడా ఇటీవల అధికారులు తనిఖీల్లో నిల్వ ఉంచిన మాంసం బయటపడంతో జనాలు ఆందోళన చెందుతున్నారు. పరిశుభ్రత, నాణ్యత లేకుండా హోటళ్లు నిర్వహిస్తున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. హోటళ్ల లైసెన్స్‌కు సంబంధించి హోటల్ యాజమాన్యాన్ని ప్రశ్నించడంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు విఫలమయ్యారనే చెప్పవచ్చు. చాలా వరకు హోటళ్లు, రెస్టారెంట్లు కాలం చెల్లిన లైసెన్స్‌లు చూపిస్తూ పబ్బం గడుపుతున్నారు. అయితే అధికారుల కొరత వేధిస్తున్నప్పటికీ ఉన్న అధికారులు సైతం నిత్యం తనిఖీలు నిర్వహిస్తే హోటల్ యజమానులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తారని అంటున్నారు. గత నెలలో షాద్‌నగర్ పరిధిలోని ఓ మండిలో భోజనం చేసిన ఓ కుటుంబానికి భోజనం వికటించి ఏకంగా ఆస్పిటల్‌లో అడ్మిట్ కావడం గమనార్హం.

తనిఖీల్లో కుళ్లిన మాంసం..

ఇటీవల ఉమ్మడి జిల్లాలో ఆరోగ్య భద్రత అధికారులు తనిఖీలు నిర్వహించగా ఒళ్లు గగుర్లుపొడిచే సన్నివేశాలు దర్శనమిచ్చాయి. వారానికి పైగా నిల్వ ఉంచిన మాంసం, వస్తువులను నిల్వ ఉంచడానికి ఏర్పాటు చేసిన ఫ్రీజర్‌లో చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా ఉండడం. వంటశాలలు దోమలు, ఈగలతో చెత్తచెత్తగా ఉండడం లాంటి ఎన్నో దృశ్యాలు గమనించిన అధికారులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఇకనైనా ప్రజలు మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు. రుచికరమైర భోజనం చేయాలని హోటళ్లకు పరుగులు తీయడం కాదు..మనం ఎన్ని రోజులు నిల్వ ఉంచిన మాంసం, ఆహార పదార్థాలు తింటున్నామో ఒకసారి ఆలోచించాల్సి ఉన్నదని నిపుణులు చెబుతున్నారు.

లైసెన్సుల రెన్యువల్ లేకుండానే..

ఉమ్మడి జిల్లాలో వేలాదిగా హోటళ్లు, రెస్టారెంట్లు కొత్త కొత్తగా ఏర్పాటు చేస్తున్నారు. నియమ, నిబంధనలు, జాగ్రత్తలు, లైసెన్సులు కూడా లేకుండా హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. వనపర్తి జిల్లాలో 375 లైసెన్సులకు 192లైసెన్సులు గడువు ముగిసినా రెన్యువల్ చేయకుండా అలాగే హోటళ్లు, తమ వ్యాపారాలు దర్జాగా నడిపించడం గమనార్హం. మహబూబ్‌గర్ జిల్లాలోనూ ఫుడ్ లైసెన్స్ రెన్యువల్ లేకుండా చాలా వరకు హోటళ్లు నడిపిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మొత్తం దాదాపు ఇదే పరిస్థితి నెలకొన్నది. ఇటీవల జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించిన దాఖలాలు ఎక్కడా లేవు. రోడ్ సైడ్ ఫుడ్ తినే వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నది. ఆహారాన్ని తిన్న తర్వాత అక్కడ ఏదైనా సమస్య ఉంటే ఎవరికి చెప్పాలి తెలియక హోటల్ యజమానల పై చివాకులు పెట్టి వెళ్ళిపోతుంటారు కచ్చితంగా ఉన్నత స్థాయి ఫుడ్ సేఫ్టీ అధికారుల నెంబర్ ఉండి ఉంటే ఫిర్యాదు చేసి వెళుతున్న పరిస్థితులు కూడా వనపర్తి జిల్లాలో కనిపిస్తుడే, జిల్లాలోనే పేరుగాంచిన హోటళ్ల పేర్లతో పాచిపోయిన కూరలు పెడుతున్నారు, పెబ్బేరు వెళ్లేదారి గుంట,కొత్తకోట రోడ్డు,గోపాలోపేట్ రోడ్డు నుండి వెళ్లే దారిలో హోటల్లో,రెస్టారెంట్లు డబ్బు లక్ష్యంగా అడ్డమైన మసాలలు ,రంగులు కలుపుతూ ప్రజల యొక్క ప్రాణలతో చెలగాటం ఆడుతున్నారు.ఇలాంటిప్రాంతాల్లో కనీసం కన్ను ఎత్తని ఫుడ్ సేఫ్టి అధికారులు యొక్క అలసత్వం నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుంది గతంలో అయినా కనీసం ఫుడ్ సేఫ్టి అధికారులు అరకోరగా చెక్ చేసేవారు.కనీసం ఇప్పుడైనా రంగ ప్రవేశం చేసి వాటి నుండి కాపాడుతారు అని ప్రజలు వాబోతున్నారు.

నాడు మాట ఇచ్చి..
నేడు నెరవేర్చి..

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షూస్ పంపిణీకి నిర్ణయం
- 274 పాఠశాలల్లో 53,000 మంది విద్యార్థులకు లబ్ధి
- తన సొంత నిధులతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- అయ్యవారిపల్లి ఇసుకను టోకెన్ ద్వారా అందజేస్తాం..
- సొంత పార్టీ కార్యకర్తలు అవినీతి చేసిన స్టేషన్‌లో కేసులు పెడతాం..
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వెల్లడి

జడ్చర్ల, జూన్ 18 ప్రభాతవార్త : ఎన్నికల ముందు ప్రసారంలో భాగంగా తాను రాజాపూర్ మండలం లో పర్యటిస్తున్నప్పుడు విద్యార్థులు కనీసం చెప్పులు కూడా లేకుండా రోడ్ల వెంట నడుచుకుంటూ వెళ్తు న్న దృశ్యాల తనను కలచివేశాయని, అప్పుడే తన నియోజక వర్గంలోని పిల్లలందరికీ షూస్ ఉచితంగా తన సొంత నిధులతో అందేయాలని నిర్ణయించు కున్నట్లు జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. జడ్చర్ల క్యాంపు కార్యాల యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజక వర్గంలోని 274 పాఠశాలల్లో 53 వేల మంది విద్యార్థులు ఉండగా అందరికి ఉచితంగా తన సొంత నిధులతో, బాట ప్యారాగాన్ కంపెనీలకు చెందిన షూస్ అందజేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకుగాను మండలాలు, - మిగతా4లో..

వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి ఎప్పటికీ..
నా గుండెల్లో ఉంటుంది..

- వీడ్కోలు సందర్భంగా భావోద్వేగానికి గురైన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్
- ఐ.ఏ.ఎస్ అధికారిగా ప్రజలకు సేవ చేసే అవకాశం చాలా తక్కువ మందికి వస్తుంది : కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి ప్రతినిధి, జూన్ 18 ప్రభాతవార్త : ఐ.ఏ.ఎస్ అధికారిగా ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు రావడం, వనపర్తి జిల్లా ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కినందుకు చాలా గొప్పగా భావిస్తున్నారని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ అధ్యక్షతన బదిలీపై సూర్యాపేట జిల్లాకు కలెక్టర్ గా వెళ్తున్న తేజస్ నందలాల్ పవార్ కు జిల్లా అధికారులు, యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా అధికారులందరూ కలెక్టర్ తమకున్న అనుబంధాన్ని, అనుభవాలని సభా వేదికగా పంచుకున్నారు. వీడ్కోలు సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేసిన భావోద్వేగ ప్రసంగం అందరి దృష్టిని ఆకట్టుకుంది కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారిగా ప్రతి - మిగతా4లో..

వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యనందించాలి

వనపర్తి ప్రతినిధి జూన్ 18 ప్రభాతవార్త : ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించే విధంగా కృషి చేయాలని టియుడబ్ల్యుజే ఐజేయు వనపర్తి పట్టణ శాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టులు డీఈఓ కార్యాలయంలో మంగళవారం డిఈఓ గోవిందరాజులు కు వినతిపత్రం అందజేశారు. గతేడాది మాదిరిగా 2024-25 విద్యాసంవత్సరానికి గాను ప్రతి ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందే విధంగా చూడాలనీ, ప్రతి పాఠశాలకు ఉచత విద్యపై సర్క్యులర్ జారీ చేయాలని - మిగతా4లో..

అధికారులు సమర్థవంతంగా పని చేయాలి

ప్రభుత్వ అధికారులు, సంక్షేమ కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలి

టీమ్ వర్క్‌గా సమన్వయంతో పని చేయాలి

జిల్లా కలెక్టర్ బి. విజయేందిర బోయి

జిల్లా అధికారులతో సమావేశం

మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రబోయి

హాజరైన అధికారులు

మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 18 ప్రభాతవార్త : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేందుకు అన్ని శాఖల అధికారులు టీమ్ వర్క్‌తో పని చేయాలని, కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని నూతన జిల్లా కలెక్టర్ బి. విజయేందిర బోయి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో నూతన జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, సమస్యలు ఆయా శాఖల వారిగా అధికారులు సమావేశంలో వివరించారు. అన్ని శాఖల అధికారుల సహకారంతో జిల్లాను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. ప్రజావాణి ద్వారా ప్రజల నుండి వచ్చే దరఖాస్తులు పరిష్కరించడంలో గుణాత్మకంగా సమస్యలు పరిష్కారం చూపాలని అన్నారు. వర్షాలు పడుతున్నందున వైద్యారోగ్య శాఖ ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖల సమన్వయంతో అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుద్ధ్యం,వ్యాధుల నివారణకు అన్ని ముందస్తు కార్యక్రమాలను కార్యాచరణ ప్రణాళిక ననుసరించి చేపట్టాలని వైద్యారోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలో వ్యవసాయ శాఖ ద్వారా వానాకాలం సాగు పంటల విస్తీర్ణం, పంటలసాగు, ఎరువులు, విత్తనాల సరఫరా గురించి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వివరించారు. విత్తనాలు, ఎరువుల సరఫరా గురించి ప్రతిరోజు రిపోర్టు చేయాలని సూచించారు. విద్యాశాఖ ద్వారా పాఠశాలలు ప్రారంభం కాగానే ఒకజత యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు సరఫరా చేసినట్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా పాఠశాలల్లో అత్యవసర రిపేర్ పనులు 5 రకాల పనులు చేపట్టినట్లు, మొదటి, రెండవ దశలో 642 పాఠశాలల్లో పనులు చేపట్టినట్లు తెలిపారు. మొదటి దశలో చేపట్టిన 490 పాఠశాలల్లో పనులు పూర్తి కావచ్చినట్లు తెలిపారు. రెండవ దశలో 152 పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.ఎస్పీ అభివృద్ధి శాఖ, ఎస్టీ, బిసి, మైనార్టీ, ఇంటర్‌మీడియట్ విద్య, వైద్యారోగ్య శాఖ, పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పరిశ్రమల శాఖ, మిషన్ భగీరథ, మున్సిపాలిటీలు, గనులు, భూగర్భశాఖ, వివిధ శాఖల వారిగా వివరించారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ఆయా శాఖల వారిగా ప్రతినెల రెగ్యులర్‌గా నిర్వహించే సమావేశాలు నిర్వహించి సమీక్ష చేయాలని అన్నారు. శాఖల వారిగా కార్యక్రమాల అమలు సమీక్ష చేయడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్లాబాద్‌కు వచ్చేసిన పరిగి డిపో బస్సు

కోయిల్‌కొండ,జూన్ 18 ప్రభాతవార్త : మండలంలోని కొత్లాబాద్ గ్రామానికి పరిగి డిపో బస్సు వచ్చేసింది. మంగళవారం పరిగి ఎమ్మెల్యే డా. పి రామ్మోహన్‌రెడ్డి బస్సును ప్రారంభించారు. గతంలో పరిగి నుంచి కొత్లాబాద్ గ్రామం వరకు బస్సులు నడిచేవని గత నాలుగు సంవత్సరాల కాలం నుంచి ఈ రూట్లో బస్సులు బంద్ కావడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. కొత్లాబాద్ గ్రామ మాజీ ఎంపిటిసి రాజిరెడ్డి, గ్రామస్తుల విన్నపం మేరకు పరిగి ఎమ్మెల్యే డా.పి.రామ్మోహన్‌రెడ్డి బస్సును ప్రారంభించడంతో గ్రామ మాజీ ఎంపిటిసి రాజిరెడ్డి, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

గౌడ సంఘం స్థలాన్ని స్వాధీనం చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

అమరచింత జూన్ 18 ప్రభాతవార్త : మున్సిపల్ కేంద్రంలోని గౌడ సంఘం సొసైటీకి సంబంధించిన స్థలాన్ని గౌడ సంఘం సంబంధించిన వ్యక్తులు స్థలాన్ని తమ పేర్లు మార్చుకొని రిజిస్ట్రేషన్లు చేసుకోవడం అన్యాయమని గౌడ సంఘం అధ్యక్షులు, అశోక్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో గౌడ సంఘం సంబంధించిన స్థలం దగ్గర నిరసన తెలిపి గౌడ సంఘం స్థలాన్ని ఏకగ్రీవ తీర్మానంతో స్వాధీనం చేసుకుంటున్నామని ఆయన తెలపారు. 1957 సంవత్సరంలో బలరాం గౌడ్ కల్లు దుకాణం సొసైటీకి అప్పగించారని గౌడ సంఘం అప్పజెప్పారని అప్పటినుండి కళ్ళు సొసైటీ పేరు మీద ఉన్న స్థలం 1987 లో గౌడ సంఘం సంబంధించిన వ్యక్తి ఎవరికి తెలియకుండా గౌడ సంఘం సంబంధించిన స్థలాన్ని తమ కుటుంబ సభ్యుల పేర్ల మీద మార్చాలని వారు తెలిపారు. గౌడ సంఘం స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహులు గౌడ్, చిన్న రాజు గౌడ్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వనపర్తి జిల్లాలో బాల, బాలికలకు జిల్లా స్థాయి ఎంపికలు

వనపర్తి ప్రతినిధి జూన్ 18 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో గల వివిధ క్రీడల పాఠశాలలో ప్రవేశం కొరకు ఈ నెల 28వ తేదీన డా. బాలకిష్టయ్య మినీ స్టేడియం, వనపర్తి గ్రౌండ్ నందు ఎంపికలు నిర్వహించబడును రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం 8 నుండి 9 సంవత్సరములు గల బాల, బాలికల కొరకై రాష్ట్ర సెలెక్షన్స్ 2024 జులై నెలలో నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశానుసారము, వనపర్తి జిల్లాలో బాల, బాలికలకు జిల్లా స్థాయి ఎంపికలు ఈ నెల 28వ తేదీ నాడు డా. బాలకిష్టయ్య మినీ స్టేడియం గ్రౌండ, వనపర్తి నందు ఎంపికలు నిర్వహించబడును జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు వచ్చేవారు ఈ క్రింది ధృవపత్రములు ఒరిజినల్, 2 జతల జిరాక్స్ కాపీలను వెంటతీసుకొని రావలెను.4వ తరగతిలో ప్రవేశాల కోసం 8 నుండి 9 సంవత్సరముల (01-09-2015,31-08-2016) మధ్య జన్మించిన వారు ఎంపికలకు అర్హులు నిర్వహించే పరీక్షల వివరములు కోసం టి.సుధీర్ కుమార్ రెడ్డి జిల్లా యువజన, క్రీడల శాఖ, అధికారి వనపర్తి జిల్లా 9885851813 వారిని సంప్రదించండి.

నీట్ లీకేజీలకు నరేంద్ర మోడీ బాధ్యత వహించాలి: ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్

వనపర్తి టౌన్ జూన్ 18 ప్రభాతవార్త : బిజెపి పాలిత రాష్ట్రాలోనే నీట్ పేపర్ల లీకేజీ జరిగిందని ప్రధాని నరేంద్ర మోడీ బాధ్యత వహించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వనపర్తి అంబేద్కర్ చౌక్‌లో నీట్ రద్దు చేయాలని దర్నా, పేపర్ లీకేజీకి నిరసన చేపట్టారు. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా, పేపర్ లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పరీక్ష సందర్భంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు చేవారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశీ, జిల్లా ఇన్చార్జ్ లు జె.రమేష్, గోపాలకృష్ణ మాట్లాడారు. ఎంతో వ్యవ ప్రయాసలకు వచ్చి చదివిన విద్యార్థులు లీకేజీతో నష్టపోయారన్నారు. విద్యార్థుల జీవితాలతో బిజెపి ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఆరోపించారు. ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రల్లోనే పేపర్ లీకేజీ జరిగిందని ఆరోపణలు వచ్చాయన్నారు. ఒకే కేంద్రంలో ఆరుగురికి 720 మార్కులు రావడం పలు అనుమానాలకు లీకేజీ పైసిట్టింగ్ చేస్తే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి వీలైనంత త్వరగా మళ్లీ పరీక్షలు జరిపించాలన్నారు. రద్దు చేసేదాకా పోరాటం కొనసాగిస్తామన్నారు. శ్రీరామ్,మహేష్, చంద్రశేఖర్, మోహన్, రాము, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొగాకు బసవమ్మ మూడవ వర్ధంతి వేడుకలు

కొత్తకోట జూన్ 18 ప్రభాతవార్త : కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రం గల మున్సిపల్ చైర్ పర్సన్ పొగాకు సుఖేషిని విశ్వేశ్వర్ నివాసంలో వనపర్తి మాజీ ఎమ్మెల్యే అయ్యప్ప తల్లి పొగాకు బసవమ్మ 3వ వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పొగాకు సుఖేషిని సభాధ్యక్షత వహించి పొగాకు బసవమ్మ చేసిన సేవలను గుర్తు చేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం మున్సిపాలిటీ కు చెందిన వివిధ వార్డుల నుండి వచ్చిన వృద్ధులకు మున్సిపల్ చైర్మన్ పొగాకు సుఖేషిని విశ్వేశ్వర్ కీర్తిశేషురాలు పొగాకు బసవమ్మ పేరట బహుమతులు అందజేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పిజె బాబు, పొగాకు బసవమ్మ కుటుంబ సభ్యులతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు ఖాజా మైనోద్దీన్, పద్మ అయ్యన్న, ఎరుకలి తిరుపతయ్య, సంధ్యా చింతలపల్లి రవీందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు వసీం ఖాన్, తహేసీన్ వహీద్ అలీ, లక్ష్మన్న రవీదంర్ రెడ్డి , వీనోద్ సాగర్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు సాజిద్ అలీ, పట్టణ ప్రదాన ఎండి తాహెర్ బాబా, తెరాస పాపయ్య రవీందర్ రెడ్డి, మేస్త్రి కురుమూర్తి, పట్టణ మైనార్టీ ఉపాధ్యక్షులు మజీద్ ఖాన్, పట్టణ మైనార్టీ ప్రచార కార్యదర్శి ఎండి జహీర్ తో పాటు వివిధ పార్టీల నేతలు పాల్గొని పొగాకు బసవమ్మ చిత్రపటానికి పుష్పంజలి ఘటించి ఘన నివాళి అర్పించారు.

వనపర్తి బస్టాండ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించండి

ఆర్టీసి డిపో మేనేజర్ వేణుగోపాల్‌కి వినతి పత్రం

వనపర్తి టౌన్ జూన్ 18 ప్రభాతవార్త : వనపర్తి బస్టాండ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వనపర్తి పట్టణ బిజెపి అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో వనపర్తి ఆర్టీసి డిపో మేనేజర్ వేణుగోపాల్ కి వనపర్తి ఆర్టీసి కాంప్లెక్స్‌లో లక్షల రూపాయలు ఆదాయం ఉన్న వనపర్తి ఆర్టిసి బస్టాండ్‌లో నెలకొన్న మహిళలకు సరైన వసతుల కొరకు సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి మహిళా ఓట్లతో గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి మహిళలు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం చేస్తున్న ఎన్నో కష్టాలు ఎదురవుతున్నాయి. సరైన సమయంలో బస్సులు రాక ఆర్టీసి బస్టాండ్‌లో నిలబడి నిలబడి విసుగు చెందుతున్నారు. రోజు రోజుకు రద్దీ పెరుగుతున్న కారణంగా మహిళలకు ఆర్టీసి బస్టాండ్ లో కూర్చోవడానికి సరైన సదుపాయం లేవు మరి అదే విధంగా మహిళలకు మూత్రశాలలు కూడా సరైనవి లేవు మంచినీటి వసతి కూడా లేదు ఆర్టీసి కాంప్లెక్స్ ల నుండి లక్షల రూపాయలు ఆదాయం ఉన్న మహిళలు కనీస వసతులు కూడా లేవు మరి భారతదేశంలో గౌరవించే మహిళలను మరి ఈ విధంగా సీఎం రేవంత్ రెడ్డి యొక్క ఆవేదనకు నిన్న మొన్న జరిగిన ఎంపీ స్థానాల్లో తగిన బుద్ధి చెప్పినారు రాబోయే కాలంలో కచ్చితంగా మహిళలే గుణపాఠం చెబుతామని తెలిపినారు తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీ మహిళలకు ఉచిత బస్సు ఇస్తానని తెలిపి గద్దెనెక్కిన సిఎం రేవంత్‌రెడ్డి ఈ రోజు మహిళలను మర్చిపోయారు రేషన్ కార్డులు ఇస్తామని నెల రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడం జరిగింది కానీ దదాపు 7 నెలలు అవుతున్న ప్రజలను పట్టించుకుంటలేదు ఆర్టీసి బస్టాండ్ లో మేనేజర్ కి వినతి పత్రం ఇవ్వడం నుంచి ప్రజల యొక్క సమస్యలను దృష్టికి తీసుకోవడం వారికి త్వరగా సులబ్ కాంప్లెక్స్, నీటి వసతి కల్పించాలని ఇవ్వడం జరిగింది లేనియెడల భారతీయ అంతా పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమం జరుగుతుందని వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చురాము ఉద్యమం చేస్తామని మేనేజర్ కి తెలిపినారు ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి రామన్ గౌడు అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ బిజెపి పట్టణ ఉపాధ్యక్షుడు కుమారస్వామి అధికార ప్రతినిధి పెద్దిరాజు వనపర్తి పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శి రాయన్న సాగర్ ఐటీ సెల్ కన్వీనర్ విజయ్ కుమార్ సాగర్ వనపర్తి పట్టణ బిజెపి ఉపాధ్యక్షులు పిఎం రాము గోవిందు అనిల్ కుమార్ గౌడ్ జ్ఞానేశ్వర్ జంగాలగుట్ట శివ, ఓం ప్రకాష్ చారి, రాజానగవరం రవి, నాగవరం తండా శంకర్ నాయక్, బిజెపి నాయకులు తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బస్సు డిపో మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న బిజెపి పట్టణ అధ్యక్షులు బచ్చురామ్

అమరచింత పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఐ ఎంఎల్ (మాస్‌లైన్) ధర్నా

అమరచింత జూన్ 18 ప్రభాతవార్త : పట్టణంలో నెలకొన్న సమస్యలను మున్సిపల్ అధికారులు తక్షణమే పరిష్కరించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి, ప్రసాద్, సిపిఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి, కే రాజన్న , సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పట్టణ కార్యదర్శి, సామేలు, డిమాండ్ చేశారు. మంగళవారం సిఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో అమరచింత మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అమరచింత మున్సిపాలిటీ నాలుగేళ్ళు పూర్తి అయిన పట్టణంలో డ్రైనేజీ కాలువలు, సిసి రోడ్లు ఆయా ఏరియాలలో లేక పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే సిసి రోడ్ల నిర్మాణం, నూతన డ్రైనేజీ కాలువలు నిర్మించాలని వారు మున్సిపల్ అధికారులను కోరారు. అలాగే వర్షాకాలంలో సీజన్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు ముందు జాగ్రత్తగా పట్టణంలోని బ్లీచింగ్ పౌడర్ పనులను చేపట్టాలని, పట్టణంలో ఉన్న మురికి కాలువలు పూడిక తీయకపోవడం వల్ల దోమలు, ఈగలు విపరీతంగా ఉన్నాయని దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు సంభవించే అవకాశం ఉందని ముందు జాగ్రత్తగా మున్సిపల్ అధికారులు ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని వారు మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ ద్వారా మంచి నీటిని అందిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిన ఇప్పటివరకు మిషన్ భగీరథ నీటిని ప్రజలు తాగడానికి ఇబ్బంది పడుతున్నారని ఇప్పటికైనా అధికారులు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని శుద్ధిచేసి ప్రజలకు తాగునీరు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రామచందర్ , భక్తి, అబ్రహం, కురుమన్న, మస్ల మని, జిలాని, తదితరులు పాల్గొన్నారు.

అమరచింత మున్సిపల్ కార్యాలయం ముందు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్

చెత్త పన్ను సేకరణ తక్షణమే ఎత్తివేయాలి...!

ప్రజలపై అధిక భారం వేసిన మున్సిపాలిటీ.. పాత పద్ధతిలోని చెత్త సేకరించాలి...! అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్..

వనపర్తి టౌన్ జూన్ 18 ప్రభాతవార్త : ప్రజలపై అధిక భారవేసిన మున్సిపాలిటీ అధిక భారం మోపుతున్న వనపర్తి మున్సిపాలిటీ తక్షణమే ఎత్తివేయాలి పాత పద్ధతిలో చెత్త సేకరించాలి. పక్కన ఉన్న గద్వాల పట్టణంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్ చెత్త పన్ను ఆపివేసి ప్రజలకు క్షమాపణ కోరాడు. చెత్త పన్ను సేకరణ చేయము అని ప్రకటన చేశారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాము. ఈ మధ్యనే గద్వాల మున్సిపల్ చైర్మన్ కేశవ్ చేసిన ప్రకటన చూసి ఎన్నో రోజులుగా వనపర్తి పట్టణ ప్రజలపై భారం వేస్తున్న మున్సిపాలిటీకి సూచన, డిమాండ్ చేస్తూ మాట్లాడిన నాయకులు ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, సిపిఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ మాట్లాడుతూ చట్టంలో లేని వ్యవస్థను ప్రజలపై రుద్దడం నేరమని, ప్రజలు తమ ఇంటి టాక్స్‌లో కట్టే పనుల్లోనే అన్ని కలిపి ఉంటాయని వనపర్తి మున్సిపాలిటీలో కొత్తగా చెత్త పన్ను వేయడం దారుణమని గత సంవత్సరముగా ప్రజల మీద పెట్టిన ఈ భారాన్ని తొలగించాలని గద్వాల కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని వనపర్తిలో కూడా చేసి అవసరమైతే మున్సిపాలిటీ ద్వారానే ఈ భారాన్ని భరించాలని నాయకులు తెలిపారు. ప్రజలకు క్షమాపణలు చెప్పకున్నా సరేగాని ఈ భారాన్ని తొలగించాలని ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, సిపిఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, రమేష్, నాయకులు బొడ్డుపల్లి సతీష్, ఆంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

చెత్త పన్ను ఎత్తివేయాలి అని డిమాండ్ చేస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక

డిజిటల్ తరగతులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందజేత

బడిబాట కార్యక్రమంలో డిజిటల్ తరగతుల దినోత్సవం

ఉప్పునుంతల,జూన్ 18 ప్రభాతవార్త : విద్యా రంగంలో, బోధనలో, మూల్యాంకనంలో సాంకేతికత డిజిటల్ పరికరాలను ఉపయోగించుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయడం జరుగుతుందని ప్రాథమిక బాలుర పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ప్రొ॥ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం డిజిటల్ తరగతుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ బిగ్‌స్క్రీన్‌పై డిజిటల్ తరగతులు ఏ విధంగా ఉపయోగపడతాయో వివరిస్తూ నూతన పాఠ్య పుస్తకాలు అన్నిటిలోనూ ప్రతి పాఠ్యాంశానికి సంబంధించిన క్యూఆర్ కోడ్లను ముద్రించడం జరిగిందని సూచించారు. క్యూఆర్ కోడ్లను ఉపయోగించి మొబైల్, ట్యాబ్, కంప్యూటర్, ప్రొజెక్టర్‌లో ఏ విధంగా ఆ పాఠ్యాంశాల డిజిటల్ విడియో పాటలను చూడాలో ఉపాధ్యాయులు గాజుల వెంకటేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇది చల్ పాటలతో ఉన్నత విద్యావంతులు, సుదీర్ఘకాలపు అనుభవం కలిగిన విషయ నిపుణులు తయారు చేశారని, వీటిని విద్యార్థులకు చూపించడం ద్వారా పాటలను సులభంగా అవగాహన చేసుకుంటారని ఆయన వివరించారు. మెరుగైన ఫలితాలు సాధించడం కోసం విద్యారంగంలో బోధన, మూల్యాంకనం, సాంకేతికతను, డీజిటల్ పరికరాలను ఉపయోగించుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణతో పాటు ఉపాధ్యాయులు గాజుల వెంకటేష్, బాలమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల బాలుర పాఠశాలలో డిజిటల్ తరగతులపై అవగాహన

గ్రూప్-2 గ్రాండ్ టెస్టులను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి

గద్వాల ప్రతినిధి జూన్ 18 ప్రభాతవార్త: ఆగస్టు 2024 మాసములో నిర్వహించే టిజిపిఎస్సి గ్రూప్ 2 గ్రాండ్ టెస్టు లను అభ్యర్థుల సద్వినియోగం చేసుకోవాలని బీసీ స్టడి సర్కిల్ డైరెక్టర్ కె.రాములు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసి అభ్యర్థులు ఈ నెల 19 నుండి వచ్చే నెల 5వ తేది వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని ఆయన అన్నారు. తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ద్వారా 4 గ్రాంట్ టెస్టులు జూలై 8వ తేది నుండి 31వ తేది వరకు నిర్వ హించబడునని తెలిపారు. పేపర్ 1 ఉదయం 10 గంటల నుండి 12.30 వరకు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. పరీక్షలు బిసి స్టడీ సర్కిల్ జోగులాంబ గద్వాల జిల్లా నందు నిర్వహించబడున ని ఇతర వివరములకు ఫోన్ నెంబర్ 08546-293022 సంప్రదించగలరని తెలియజేశారు.

నీట్ పరీక్ష రద్దు చేయాలని ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన

కొత్తకోట జూన్ 18 ప్రభాతవార్త : కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ విద్యార్థి సంఘము ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ కు నిరసనగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తుపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. నీట్ పరీక్షలపై ప్రధాన మంత్రి, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వెంటనే నీట్ పరిక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీ పై సుప్రీం కోర్టు జడ్జితో సంబంధం ఉన్న దోషులను శిక్షించాలని కోరారు. నరేంద్ర మోడీ మౌనం విడాలని కోరారు,లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ స్టేట్ జనరల్ సెక్రటరీలు ఎం.డి అక్బర్ , కృష్ణవర్ధన్ రెడ్డి, కొత్తకోట మున్సిపాలిటీ టౌన్ ఎన్ఎస్‌యుఐ అద్యక్షులు శ్యామ్, కొత్తకోట మండల ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు దిలీప్ రెడ్డి, అసెంబ్లీ జనరల్ సెక్రటరీలు రాఘవరెడ్డి, రమేష్, మండల ఉపాధ్యక్షులు రమేష్, పలువురు విద్యార్థి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ చౌరస్తాలో దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న విద్యార్థులు

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ

ఉప్పునుంతల,జూన్ 18 ప్రభాతవార్త : స్థానిక పోలీస్ స్టేషన్‌ను అచ్చంపేట డీఎస్పీ అల్లె శ్రీనివాసులు మంగళవారం సందర్శించారు. స్టేషన్‌లో రికార్డు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు లోపించకుండా చూడాలని, పోలీస్ శాఖ ప్రజలకు అందుబాటులో ఉండి రక్షణ వలయంగా పని చేయాలని ఎస్సై లెనిన్‌కు సూచించారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

మద్దకల్ జూన్ 18 ప్రభాతవార్త : జోగులాంబ గద్వాల జిల్లా మద్దకల్ మండల కేంద్రంలోని రైతులకు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సింగల్ విండో చైర్మన్ శేషంపల్లి తిమ్మారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్.ఎన్.ఆర్ 30 కేజీల బ్యాగు రూ. 1094 / బి.పి.టి 150 కేజీల బ్యాగు 1083 రూపాయలకు అందుబాటులో ఉన్నాయి వడ్లు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, భూమి పాస్ బుక్ జిరాక్స్ కాపీలు తీసుకుని మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని సంప్రదించాలని తిమ్మారెడ్డి కోరారు.

గోవులను తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

మక్తల్ భజరంగ్ దళ్ నాయకులు

బొలేరోలో గోవులను తరలిస్తున్న దృశ్యం

మక్తల్ రూరల్,జూన్ 18 ప్రభాతవార్త : మక్తల్ పట్టణ ప్రాంత సమీపంలో బొలెరో వాహనం (కెఎ37బి6742) గోవులను తరలిస్తూ ఉండగా మక్తల్ గ్రామానికి చెందిన కొందరు భజరంగ్‌దళ్ నాయకులు వాహనాన్ని ఆపి పోలీసులకు అప్పగించారు. గోవులను అక్రమంగా తరలిస్తూ ఉండగా పట్టణ ప్రాంతానికి సమీపంలో ఉన్న హెచ్‌పి పెట్రోల్ పంపు సమీపంలో సమాచారాన్ని అందుకున్న బజరంగ్ నాయకులు వచ్చి గోవులను ఎక్కడికి తీసుకెళ్తున్నారని అడగగా వారి నుండి ఎలాంటి సమాచారం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసి, పనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదును అందజేశారు. బొలెరో వాహనాన్ని పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేసి గోశాలకు తరలించామని అధికారులు తెలియజేశారు.

నివాళులర్పించిన ట్రస్టు చైర్మన్ సోమనాద్రి

నివాళులర్పిస్తున్న ట్రస్టు చైర్మన్ సోమనాద్రి

ఇటిక్యాల,జూన్ 18 ప్రభాతవార్త : మండల పరిధిలోని జింకలపల్లి గ్రామానికి చెందిన పౌల్ట్రీ ఫామ్ యజమాని సత్యారెడ్డి తల్లి అంజనమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కొండేరు గ్రామానికి చెందిన శంకరమ్మ సేవాదళం ట్రస్టు చైర్మన్ పోతురాజు సోమనాద్రి ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరి వెంట రవి, కె. లక్ష్మన్న, కె.కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ఎక్సైజ్ ఆధ్వర్యంలో విస్తృత దాడులు

- 8 కేసులు నమోదు, 34 లీటర్ల నాటుసారా, 1300 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం

దాడులు నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దండ, జూన్ 18 ప్రభాతవార్త: సారా రహిత తెలంగాణ సాధనే లక్ష్యంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్, మహబూబ్‌నగర్ ఎన్ ఫోర్స్‌మెట్, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ స్టేషన్స్ తెల్కపల్లి, అచ్చంపేటల సంయుక్త ఆధ్వర్యంలో కల్వకుర్తి ఎక్సైజ్ బృందం ఆధ్వర్యంలో వెల్దండ పోలీసులతో కలిసి మండలంలోని మైసమ్మ పల్గుతాండ, చిన్యతాండ, మర్రిగుంతతాండ, గాజులోనిబావితాండ, నెమలిగుండతాండ, పెరుమాళ్ల కుంట తాండ, కల్వకుర్తి మండల కేంద్రం, తర్నికల్ గ్రామాల్లో నాటుసారా తయారీ కేంద్రంలో, విక్రయ కేంద్రాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించి 8 కేసులు నమోదు చేసి 6 మందిని అరెస్ట్ చేయడంతో 34 లీటర్ల నాటుసారా, 1300 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతమైన తనిఖీలు నిర్వహించి నాటుసారాపై ఉక్కుపాదం మోపి కేసులు నమోదు చేస్తామన్నారు. దాడుల్లో సీఐలు శారద, భిక్షారెడ్డి,రమణయ్య, ఎస్ఐలు వివేక్, సతీష్, బాలరాజు, చిన్న రాములు, వెల్దండ ఎస్ఐ రవి తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

కల్వకుర్తిరూరల్, జూన్ 18 ప్రభాతవార్త: అకాల మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి బాల్య మిత్రులు అండగా నిలిచారు.కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన పెరుమాల్ల కృష్ణ ఇటీవల అకాల మరణం చెందారు. మృతుడి కుటుంబానికి చేయూతగా నిలువాలని కృష్ణ మిత్రులు రవిగౌడ్, విజయ్ భాస్కర్, అల్లం వంశీ, వీరెడ్డి దామోదర్‌రెడ్డి, రామోజీ, మదన శ్రీను, కర్నాటీ రవీందర్‌లు మంగళవారం పరామర్శించి మృతుడి భార్య అలివేలకు రూ.19వేల ఆర్థిక సహాయం అందించారు. బాల్య మిత్రుడు కృష్ణ కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థినీ విద్యాభివృద్ధికి ఉప్పల ట్రస్ట్ చేయూత

విద్యార్థిని అక్షిత విద్యాభివృద్ధికి చేయూతనందించిన దృశ్యం

కల్వకుర్తి, జూన్ 18 ప్రభాతవార్త: కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన నాగమణి కుమార్తె అక్షిత ఉన్నత చదువులకు చేయూత నందించాలని గ్రామ ఎంపీటీసీ కడల సంతోష మల్లేష్, గ్రామ టీఆర్ఎస్ నాయకులు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్‌ను సంప్రదించారు. నాగమణి ఆర్థిక ఇబ్బంది, అక్షితకు చదువుపై ఉన్న శ్రద్ధను గమనించిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ హైదరాబాద్‌లోని ప్రైవేటు కృష్ణవేణి జూనియర్ కళాశాల యాజమాన్యంతో మాట్లాడి అక్షితకు అడ్మిషన్ చేయించారు. అక్షిత ఉన్నత చదువులకు సహకరించిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్‌కుకుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తాండ్ర తిరుపతి, అల్లుడు కృష్ణ, రాజు, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

జోహార్ కామ్రేడ్ మోటూరు హనుమంతురావు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్

మోటూరు హనుమంతురావు చిత్రపటానికి నివాళులు అర్పించిన సిపిఎం జిల్లా ఎండి జబ్బార్

వనపర్తి టౌన్ జూన్18 ప్రభాతవార్త: సిపిఎం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ మోటూరు హనుమంతురావు 23వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ మాట్లాడుతూ తెలంగాణ రైతంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న మహా వ్యక్తి అని, కమ్యూనిష్టు పార్టీ తీర్చిదిద్దిన వ్యక్తి ఆయన ప్రజా సమస్యలపై అసెంబ్లీ, పార్లమెంటులో పలు అంశాలపై చర్చించి ప్రజలకు ఉపయోగపడే చట్టాలు తీసుకోవడంలో ప్రయత్నం చేశారన్నారు. ప్రజాశక్తి సంపాదకులుగా ఉంటూ రైతు, కార్మికుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ రాసేవారు.మితవాది,అతివాద పోకడల నుండి పార్టీని రక్షించు కోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన నేత మోటూరు హనుమంతరావు ని వారన్నారు. వారు స్ఫూర్తితో రానున్న రోజుల్లో సిపిఎం పార్టీ విస్తరణకు కృషి చేయాలని కార్యకర్తలకు వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి బాల్ రెడ్డి, నాయకులు ఉమ, సాయిలీల, బాలపీరు, పురుషోత్తం, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డిఓకు ఘన సన్మానం

కొత్తకోట జూన్ 18 ప్రభాతవార్త: కొత్తకోట శ్రీ వినాయక స్కూల్ బస్ డ్రైవర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం వనపర్తి ఆర్డిఓ మానసను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. నాగవరం దగ్గర వనపర్తి జిల్లా స్కూల్ బస్సు డ్రైవర్లతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యతిథులుగా హాజరై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. బస్సులు ఏ విధంగా నడపాలి పిల్లల్ని ఎంత జాగ్రత్తగా తీసుకెళ్లాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట శ్రీ వినాయక స్కూల్ బస్ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శేఖర్‌చారి, ఉపాధ్యక్షులు ఏ సత్యాన్న, జనరల్ సెక్రటరీ కే అచ్చిరెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

20న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

బిజినపల్లి వైద్యాధికారి డాక్టర్ ఎం.శివకుమార్

బిజినపల్లి,జూన్ 18 ప్రభాతవార్త: వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజా ఆరోగ్య కార్యక్రమాన్ని ఈనెల 20న జాతీయ నులిపురుగుల నివారణ కొరకు 1 నుండి 19 సంవత్సరాల వయసు గల లోపు వారికి ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు బిజినపల్లి మండల వైద్యాధికారి డా. ఎం. శివకుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బిజినపల్లి, లట్టుపల్లి వైద్యారోగ్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు సంయుక్తంగా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాస సమయంలో శుభ్రత పాటించకుండా కలుషిత ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల శరీరంలో నులి పురుగులు,కొంకి పురుగులు, ఎలికాపాములు తయారవుతాయని, వాటిని నివారణకు ఆల్బెండజోలు మాత్ర విశేషంగా పని చేస్తుందని అన్నారు. శరీరంలో నులి పురుగులు ఉండటం వల్ల విద్యార్థి ఏకాగ్రత, శ్రద్ధ, మానసిక, శారీరక పెరుగుదల, చురుకుదనం మందగిస్తాయని, పాఠశాలకు వెళ్లే హాజరు శాతం తగ్గుతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈనెల 20న గురువారం మండలంలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలో గుర్తించిన బడి బయట ఉన్న వారికి ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా వేస్తామని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో, కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఈనెల 20న హాజరు కాకుంటేతిరిగి 27న మాత్రలు వారికి అందజేస్తామని అన్నారు. బిజినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 7656 మందిని గుర్తించామని 32 పాఠశాలలు 24 అంగన్‌వాడి కేంద్రాల్లో ఈ మాత్రలు వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తల ద్వారా అందజేస్తామని అన్నారు. ప్రతి విద్యార్థి భోజనం చేసిన తర్వాతనే మాత్రను స్వీకరించాలని సూచించారు. బిజినపల్లి మండల కేంద్రం, వెలుగొండ, శాయిన్‌పల్లి, పోలేపల్లి ఇతర గిరిజన తండాలు, లట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని మంగనూరు, గంగారం,గౌరారం, లట్టు పల్లి, ఎర్రకుంట తండా,ఇతర గిరిజన తండాలలోని అన్ని పాఠశాల అంగన్‌వాడి విద్యార్థులకు తప్పనిసరిగా వేస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి మండల పరిదిలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు, మహిళా సంఘ సభ్యులు, సామాజిక నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బిజినపల్లి, లట్టుపల్లి, వైద్యారోగ్య సిబ్బంది డాక్టర్ తేజస్విని, డా. రవళి,డా.రమ్య, ఆరోగ్య పర్యవేక్షకులు వై. శ్రీనివాసులు, అశోక్, కె. కిష్టమ్మ, రాణి, ఆరోగ్య కార్యకర్తలు సిబ్బంది యాదగిరి, నగేష్, ఆంజనేయులు, మంగ, పద్మ, బొజ్జమ్మ, ఆశా కార్యకర్తలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీజియన్ పరిధిలో అన్ని డిపోలు అభివృద్ధి పదంలో నడుస్తున్నాయి

-125 పాత షాపుల స్థానంలో కొత్త షాపుల నిర్మాణం

-మరో 1200 నూతన బస్సులకు ప్రతిపాదనలు : ఆర్టీసీ ఆర్ఎం.శ్రీదేవి

కల్వకుర్తి, జూన్ 18 ప్రభాతవార్త: కల్వకుర్తి రీజియన్ పరిధిలోని అన్ని ఆర్టీసీ డిపోలను అభివృద్ధి పదంలో నడుస్తున్నాయి. రీజియన్ పరిధిలో పాత షాపుల స్థానంలో 125 కొత్త షాపుల నిర్మాణం చేపడుతున్నామని ఆర్టీసీ ఆర్ఎం.శ్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలో ఉన్న డిపో సందర్శన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రీజియన్ పరిధిలో 1200 కొత్త బస్సులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆమె పేర్కొన్నారు. వంగూరు మండలంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను గోదాం, ఫంక్షన్ హాల్ కోసం లీజుకు ఇస్తామన్నారు. రోడ్డు సౌకర్యం ఉన్న ప్రతి గ్రామానికి బస్సులు నడుపుతామని, బస్సులు, సిబ్బంది కొరత ఉండటం వల్ల ఆయా రూట్‌లలో బస్సులను నడపలేకపోతున్నామన్నారు. త్వరలోనే ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రయాణీకులు ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని, సురక్షమైన ప్రయాణం ఆర్టీసీ బస్సుల్లో ఉంటుందన్నారు. సమావేశంలో డిపో మేనేజర్ సుభాషిని, సీఐ శ్వేత ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలలో గాయపడిన బాధితునికి మేఘారెడ్డి అభయహస్తం

పెద్దమందడి జూన్ 18 ప్రభాతవార్త: మండల పరిధిలోని మోజర్ల గ్రామంలో సోమవారం బొలెరో వాహనం ఢీకొని పొతుల రాములు గౌడ్ అనే వ్యక్తిగాయ పడ్డాడు.కుడి చేయిమూడుచోట్ల విరగడంతో బాధితునికి ఆర్థిక పరిస్థితి గురించి వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తూడి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించిన శ్రీనివాస్ రెడ్డి రూ.5వేలు గ్రామ కాంగ్రెస్ నాయకులతో పంపాడు. ఎంపీపీ రఘు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు కొత్తరావు రామకృష్ణరెడ్డిలు బాధి తుడిని ఆసుపత్రిలో పరామర్శించి,కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.

కారును ఢీకొన్న డీసీఎం

రాజాపూర్,జూన్18 ప్రభాతవార్త: మండల పరిధిలోని రంగారెడ్డి గూడ గ్రామ సమీపంలో కారును ఢీకొన్న డిసిఎం మంగళవారం హైదరాబాద్ నుండి తిరుపతి వెళ్తున్న శ్రీలత రాజోలి టిజి 09 టిఆర్ 2670 తన కారులో తిరుపతి వెళ్తుండగా రాజాపూర్ మండల పరిధిలోని రంగారెడ్డిగూడ గ్రామ సమీపంలో టిజి 12 టి 0875 గల డిసిఎండ్రైవర్ అతి వేగంగాఅజాగ్రత్తగా నడుపుతూ తన కారును ఢీకొన్నాడని తనకారు డోరు డ్యామేజ్‌అయ్యిందని కారులో ప్రయాణిస్తున్న ఎవరికిఎలాంటి ప్రమాదం జరగలేదని అతివేగంగా అజాగ్రత్తగా డిసిఎం నడిపిన డ్రైవర్‌పై చట్టరిత్యా చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆమె రాజాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగాదర్యాప్తు చేసిచర్యలు తీసుకుంటామని ఎస్సై రవి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

బిజినేవల్లి,జూన్ 18 ప్రభాతవార్త: మంగనూరు గ్రామంలో ఆర్టీసి బస్సు, బైక్ ఢీకొట్టిన సంఘటనలో గాయాల పాలైన ఆంజనేయులుగౌడ్ (24) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల 11 తేదీన మంగనూరు గ్రామంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో సొంత బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఆంజనేయులును 108 వాహనంలో నాగర్ కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తుండగా మృతి చెందినట్లు తండ్రి వెంకటయ్యగౌడ్ తెలిపారు. మృతుడు ఇద్దరు కుమారుల్లో చిన్నవాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

మనస్తాపంతో యువకుడు మృతి

బిజినపల్లి,జూన్ 18 ప్రభాతవార్త : పోలేపల్లి గ్రామానికి చెందిన సి. మల్లేష్ (25) మనస్థాపంతో మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్లేష్ తల్లి రంగమ్మ తన మేనమామ ఊరైన తాడూరు మండలం పర్వతాయపల్లికి వెళ్లింది. హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగించే మల్లేష్ సోమవారం తన మిత్రుని బైక్‌పై గ్రామానికి వచ్చాడు. మేనమామ ఊరికి వెళ్లి తల్లిని తనతో పాటు గ్రామానికి రావాలని కోరడంతో నిరాకరించింది. దీంతో ఆగ్రహానికి గురై తల్లిపై చేయి చేసుకోబోగా మల్లేష్‌ను మేనమామ మందలించి పంపించేశాడు. అనంతరం సొంత గ్రామానికి వచ్చిన మల్లేష్ మద్యం సేవించి మద్యం మత్తులో మనస్థాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాకులారం గ్రామ నడి మధ్యలో ఆగిన వర్షపు నీరు

గద్వాల ప్రతినిధి జూన్18 ప్రభాతవార్త: గద్వాల మండలం కాకులారం గ్రామంలో ఊరు మధ్యన వర్షపు నీరు నిలువ ఉండడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది అంటుకోగాలు వచ్చే ప్రమాదం ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగిన నీరు తొలగించండి మహాప్రభో అంటూ గ్రామ ప్రజలు, వాహనదారులు కుర్రో ముర్రో లని వేడుకొంటున్న అధికారులు స్పందించడం లేదని ప్రజలు అంటున్నారు. మరోసారి వర్షం నీరు ఆగకుండా రోడ్డుకి ఇరువైపులా డ్రేయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని గ్రామస్థుల విన్నపం చేస్తున్నారు. గద్వాల మండలంలోని కాకులారం గ్రామంలో ఈ మధ్య కురిసిన వర్షం వల్ల గ్రామంలోని నడి సెంటర్ లో మీరు ఆగిపోవడం వల్ల పాదచారులకు కానీ ఇటు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి సంవత్సరం ఇలాగే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్య పై శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ముందే వానాకాలం ఈ యొక్క రోడ్డు పై నీరు ఆగిపోవడం వల్ల దోమల బెడద ఎక్కు వై ప్రక్కన వున్న కాలనివాసులకు మలేరియా , టైఫాయిడ్ జ్వరాలు వచ్చే అవకాశం వుంటుందని అన్నారు. ప్రస్తుతం రోడ్డు పై నిలిచిపోయిన వర్షపు నీటిని మోటార్ పంపుల ద్వారా నీటిని తొలిగించాలని విన్నవించుకుంటున్నారు. ఆదే విధంగా రోడ్డుకి ఇరువైపులా డ్రెయినేజీ కాల్వలు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు వుండవని గ్రామ ప్రజలు తెలిపారు.

శ్రీకురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు

కురుమూర్తి స్వామివారి హుండీని లెక్కిస్తున్న దృశ్యం

చిన్నచింతకుంట,జూన్ 18 ప్రభాతవార్త: పల్లె ప్రజల ఆరాధ్య దైవంగా కొలవబడుతూ, పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం స్వామివారిని దర్శించుకున్న అనంతరం కానుకల రూపేణా స్వామివారి హుండీలో వేసిన నగదును మంగళవారం ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి సమక్షంలో లెక్కించారు 4 లక్షల 66 వేల 646 రూపాయల హుండీ ఆదాయం రావడం జరిగిందని ఆలయ ఈఓ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన అర్చక బృందం, భక్తులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన జడ్పీ చైర్‌పర్సన్

మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 18 ప్రభాతవార్త: మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా ఆదివారం పదవి బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ బి. విజయేందిర బోయినిని మంగళవారం కలెక్టరేట్‌లో కలిసిన జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, జడ్పీ సిఈఓ రాఘవేంద్ర రావు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు అధికారులు, ఉద్యోగులు నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పిల్లల్లో నులిపురుగులు రాకుండా చూడాలి

-అంగన్‌వాడీలకు ఆసుపత్రి ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్

భూత్పూర్,జూన్ 18,ప్రభాతవార్త: ఒక సంవత్సరం నుంచి 19ఏళ్ల మధ్య వయసున్న పిల్లల్లో నులిపురుగులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని,ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నులిపురుగుల నిర్మూలన మాత్రలు పిల్లలచే ఈ నెల 20న మింగించాలని భూత్పూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.మంగళవారం స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీలకు నులిపురుగుల నిర్మూలనపై ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్ అవగాహన కల్పించారు. పాఠశాలలు, కళాశాలలు,ప్రైవేట్ పాఠశాలల్లో చదివే 19ఏళ్ల లోపు విద్యార్థిని విద్యార్థులకు ఈ నెల 20 భోజనం తర్వాత తప్పనిసరిగా మింగించాలని సూచించారు. పాఠశాలల్లో హాజరు పట్టిన రిజిష్టర్‌లో మాత్రలు మింగిన విద్యార్థులను టిక్ మార్కు ద్వారా నులిపురుగుల మాత్రలు మింగిన విద్యార్థులు,తప్పిన విద్యార్థుల వివరాలు తెలిసి పోతుందని వివరించారు. ఆరోగ్య సిబ్బంధితో పాటుఅంగన్‌వాడీలువిధిగా బడుల్లో ఉన్న,బడి బయట ఉన్న పిల్లలకు మాత్రలు మింగించాలని పేర్కొన్నారు.మిస్సైన పిల్లలకు మాపప్ ద్వారా అంగన్‌వాడీలు ఈ నెల 27వరకు ఇంటింటికి తిరిగి వారిని గుర్తించి మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ అయూబ్‌ఖాన్ ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బిజినపల్లి,జూన్ 18 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని మహ్మద్ మూసభాయ్ అనారోగ్యంతో మరణించడంతో బాధిత కుటుంబాన్ని గ్రామ నాయకులు పరామర్శించారు. నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపిటిసి బాలస్వామిలు పరామర్శించి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో మండల మైనార్టీ నాయకులు ఎండి గఫూర్, ఇస్మాయిల్, మహ్మద్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

జిల్లా కలెక్టర్, ఎస్పీని కలిసిన బీఎస్పీ పార్టీ నాయకులు

కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న బిఎస్పీ నాయకులు

మక్తల్ రూరల్,జూన్ 18 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామ వివాదంలో హత్య చేయబడ్డ సంజీవ్‌కుమార్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా కలెక్టర్, ఎస్పీని బీఎస్పీ పార్టీ నాయకులు కలిశారు. ఈసందర్భంగా బీఎస్పీ పార్టీ నాయకులు దశరథ్‌కుమార్ అడ్వకేట్ మాట్లాడుతూ హత్య చేయబడ్డ సంజీవ్‌కుమార్‌కు భార్య అనితతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారని వారి జీవనోపాధి కష్టంగా మారిందని అందుకనే రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఆ కుటుంబానికి ప్రకటించి ఆ కుటుంబంలో భార్యకు ఉపాధి కల్పించాలని అలాగే తక్షణమే ఒక కమిటీ వేసి హత్యకు ప్రేరేపించిన అంశాలను క్లుప్తంగా ఇన్వెస్టిగేషన్ చేసి వారిపై చర్యలుతీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దేవిడ్, గోపాలకృష్ణ, వేణు, గువ్వల శివరాజ్, కర్నె బాలరాజు, మూర్తి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

కోమటికుంట ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

లింగాల,జూన్18 ప్రభాతవార్త: మండల పరిధిలోని కోమటికుంట గ్రామంలో మంగళవారం శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు, భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో భక్తులు హోమాలు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి ఛైర్మన్ ఎత్తపు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం గ్రామస్తులందరూ ఐక్యతతో ఉండి ఆలయ నిర్మాణం కోసం రూ. 58 లక్షలు విరాళాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.అందులో నుంచి గుడి నిర్మాణం కోసం రూ.56లక్షలు ఖర్చు అయ్యాయని తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎత్తపు లక్ష్మణరావు, వైస్ ఛైర్మన్ దయానందం, కొరుపాల కమలాకర్, ఆలయ కమిటిసభ్యులు ఎత్తపుఆనందరావు, సుధాకర్‌రావు, గుడి శ్రీనివాసులు, చిన్నారెడ్డి, జంగయ్య, రాముడు, శివ, రామకృష్ణ, మల్లేష్, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కన్నుల పండువగా చక్రస్నానం

◆ముగిసిన శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

చంద్ర పుష్కరిణిలో చక్రస్నానం ఆచరిస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్18 ప్రభాతవార్త: శ్రీపురం శ్రీరంగనాయకస్వామి ఆలయంలో 4 రోజుల పాటు ఘనంగా నిర్వహించిన బ్రహ్మోత్సవ వేడుకలు మంగళవారం ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాపూర్ణహుతి అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న చంద్రపుష్కరిణిలో చక్రస్నానం కనుల పండువగా నిర్వహిం చారు. వేలాది మంది భక్తులు చక్రస్నానం కార్యక్రమంలో పాల్గొని కొనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు.గంగోత్రి యుమనోత్రి ఆలకనంద తదితర నదుల నుంచి తీసుకున్న పవిత్ర జలాలను కోనేరులో కలిపి చక్రస్నానం ఘట్టాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం పరవ పదోత్సవం సప్తావరణాలు తదితర పజలతో ఉత్సవాలు ముగిశాయి.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

-బీఆర్ఎస్వీ కల్వకుర్తి అధ్యక్షులు దారమోని గణేష్

కల్వకుర్తిటౌన్, జూన్ 18 ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుకుంటుందని బీఆర్ఎస్వీ కల్వకుర్తి అధ్యక్షులు దారమోని గణేష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీట్ పరీక్ష అవకతవకలపై ఇప్పటి వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏలాంటి చర్యలు తీసుకోకుండా నామమాత్రంగా వ్యవహ రించడం సిగ్గుచేటుకరమన్నారు.బాధ్యులైన వారిపైచర్యలు తీసుకొని దర్యాప్తు ముమ్మరంచేసి పరీక్ష రాసిన విద్య

లింగమయ్య నామస్మరణతో మార్మోగిన కర్ని

మక్తల్,జూన్ 18 ప్రభాతవార్త: మండలంలోని కర్నిలో వెలసిన శ్రీ లింగ మయ్య స్వామి జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల సందర్భంగా లింగమయ్యస్వామి వారి ఆలయాన్ని పరిసరాలన్ని లింగమయ్య నామస్మరణతో మారుమోగాయి. అంతకు ముందు భక్తులు కాగు(కుండ)లలో ప్రత్యేకంగా తయారుచేసిన నైవేద్యాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా స్వామివారి ఆలయం వరకు చేరుకుని స్వామివారికి సమర్పించి తమమొక్కులను చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులు ఎంతోపవిత్రంగా భావించే బండారు (పసుపు)ను స్వామివారికి చల్లుతూ పులకించిపోయారు. ఈఏడాది ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయ డంతోఉత్స వాలకు మరింత శోభ సంతరించుకుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

జములమ్మ తల్లీ కరుణించమ్మ

జమ్ములమ్మ దేవాలయంలో పోటెత్తిన భక్తులు

గద్వాల్ ప్రతినిధి,జూన్18 ,ప్రభాతవార్త: జోగులాంబ గద్వాల్ జిల్లా జమ్మిచెడు గ్రామంలో వెలసిన జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు క్యూ కట్టారు. తెల్లవారుజామున ఐదు గంటల నుండే భక్తులు తాకిడి పెరిగింది. జమ్ములమ్మ తల్లీ కరుణించవమ్మా ,అంటూ భక్తిభావంతో ఊగిపోయారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు .బైనోళ్లు ,కుర్వదోళ్ల చప్పుళ్లు ,శివసత్తుల పూనకాలతో జములమ్మ తల్లీ దీవనలు ఇవ్వమ్మా అంటూ భక్తులు అమ్మవారిని కొలిచారు సాయంత్రం వరకు 20వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఈవో పురేందర్ తెలిపారు. ఆలయ చైర్మన్ గాయత్రి సతీష్‌కుమార్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. అమ్మవారి దర్శినానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది .

ఘనంగా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జన్మదిన వేడుకలు

భూత్పూర్,జూన్ 18,ప్రభాతవార్త: భూత్పూర్ మండల గ్రంథాలయ సంస్థ చైర్మన్ గడ్డం యాదయ్య జన్మదిన వేడుకలు భూత్పూర్ పట్టణ కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై గడ్డం యాదయ్యను శాలువలు, పూలమాలలతో సత్కరించి, కేక్ కట్ చేసి స్వీట్లు తిని పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, టి మురళిధర్‌గౌడ్, గడ్డం ప్రేమ్‌కుమార్, గడ్డం రాములు, మేకల సత్యనారాయణ, సత్తూర్ అశోక్‌గౌడ్, సత్తూర్ రాకేష్ గడ్, సత్తూర్ సురేష్‌గౌడ్, మొహ్మద్ సాధిక్, వడ్ల బ్రహ్మయ్య, సత్తూర్ కృష్ణయ్య గౌడ్, మండి ఆటో వెంకటయ్య, సత్తూర్ కరుణాకర్‌గౌడ్, మంగళి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.6,67,075 విలువ గల అంబర్, జర్దా, గుట్కా ప్యాకెట్ల పట్టివేత

ప్రభుత్వ నిషేధిత గుట్కా, జర్దా ప్యాకెట్లు పట్టుకున్న దృశ్యం

మక్తల్ రూరల్,జూన్ 18 ప్రభాతవార్త: జిల్లా కేంద్రంలో నారాయణపేట పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సంయుక్తంగా పలు కిరాణా షాపులలో దాడులు నిర్వహించి ప్రభుత్వ నిషేధిత అంబర్, జర్దా గుట్కా ప్యాకెట్లను, పాన్ మసాలా, పొగాకు జర్దాకలిపి అమ్ముతున్నందున పట్టుకున్నారు. అశోక్ పసారి కిరాణం గోదాంలో రూ.6,44,865 విలువగల గుట్కా, కె. వెంకట్రాములు తండ్రి కృష్ణయ్యకు చెందిన కృష్ణ కిరాణంలో రూ. 13,090 విలువ గల గుట్కా, నజీర్ అహ్మద్ కిరాణంలో రూ. 9120 విలువ గల గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వ నిషేధిత జర్దా,గుట్కా ప్యాకెట్లను అక్రమంగాకిరాణంలో నిల్వఉంచి ప్రజలకు అమ్ముతున్నారని పంచనామా అనంతరం సిఐ శివశంకర్ ఆదేశాల మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

టూరిజం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 18 ప్రభాతవార్త: నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిధమ్) గచ్చిబౌలి, హైదరాబాద్‌లో టూరిజం కోర్సులు చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తెలంగాణా ప్రభుత్వ ఆమోదిత కళాశాల నిధమ్‌లో ఇంటర్, డిగ్రీలో బీఎస్సీ, బిబిఏ, ఎంబిఏ అడ్మిషన్ల ప్రక్రియ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి కంపెనీలలో పనిచేసే అవకాశం లభిస్తుంది. క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు దేశంలోని హాస్పిటాలిటీ ఇండస్ట్రీలో అనేక అవకాశాలు లభిస్తాయి. జాతీయ స్థాయివిద్యా విధానంతోనిధమ్‌లో ఉన్నత ప్రమాణాలతో కోర్సులు అందిస్తున్నది. అడ్మిషన్, ఇతరవివరాలకుహైదరాబాద్‌లో ఉన్న నిధమ్ 9553700 034 లేదా 9553700035 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యనందించాలి

(మొదటి పేజీ తరువాయి)

వినతిపత్రంలో పేర్కొన్నారు. సానుకులంగా స్పందించిన డీఈఓ గోవింద రాజులు రెండు లేదా మూడు రోజుల్లో ప్రతి జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందే విధంగా సర్కులర్ జారీ చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, టీయూడబ్ల్యూజే ఐజేయు మాజీ నేషనల్ కౌన్సిలర్ సభ్యులు మల్యాల బాలస్వామి, వనపర్తి జిల్లా ఎడ్యుకేషన్ కన్వీనర్ కుమార్, సీల్ మూర్తి ఆంజనేయులు, తిరుపతయ్య, ముంత రవి యాదవ్, స్వామి పాల్గొన్నారు.

పాఠశాల లోగిళ్ళు పచ్చదనం పరవళ్ళు

అమ్మఒడి... అప్పంపల్లి బడి
ఉపాధ్యాయుల సమిష్టి కృషి గ్రామస్తుల సహకారం

దేవరకద్ర,జూన్ 18 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాల అంటే శిథిలమైన భవనాలు, రంగు వెలసిన గోడలు, పచ్చదనం కనుచూపు మేరైనా కనిపించని దృశ్యాలు కళ్లముందు కనిపిస్తాయి. కానీ ఇక్కడ ఒక ప్రభుత్వ బడి మాత్రం ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధుల సహకారంతోపాఠశాల పరిసరాలన్నిపచ్చదనంతో పరవళ్ళు తొక్కుతున్నాయి. పాఠశాల ఆవరణలోకిఅడుగు పెట్టగానే పూల మొక్కలు, పండ్ల మొక్కలు ఎక్కువగాపెరిగిన భారీవృక్షాలు స్వాగతం పలుకుతూ ఆహ్లాదాన్ని కలిగిస్తాయి

గ్రామస్తుల సహకారం మారిన రూపురేఖలు...

మహబూబ్‌నగర్ జిల్లా అప్పంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో సత్సంబంధాలు ఏర్పరచుకుని మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు పాఠశాల రూపురేఖల్ని సమూలంగా మార్చివేశారు. గత ప్రభుత్వం పాఠశాల అభివృద్ధి కోసం పెద్దగా నిధులు కేటాయించకపోవడంతో దశాబ్ద కాలంగా ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులు గుణాత్మక విద్యను అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి తోడ్పడ్డారు.

సమకూరిన సౌకర్యాలు...

ఉపాధ్యాయులు విద్యను బోధిస్తూనే పాఠశాల మౌలిక సదుపాయాలపై దృష్టిని సారించారు. పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటి ఏర్పాటు కోసం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. సభ కార్యక్రమాలకు వేదిక లేకపోవడంతో పూర్వ విద్యార్థుల సహకారంతోనే వేదిక నిర్మించి ఉపయోగించుకుంటున్నారు. వేదికపై షెడ్డు నిర్మాణానికి గ్రామానికి చెందిన మరో దాత సహకరించడంతో నిరంతరాయంగా బాల సభలు పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు, జాతీయ పండుగలు ఈ సభా వేదిక మీదనే జరుపుకుంటున్నారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి ఒకరు తన సొంత ఖర్చులతో పాఠశాల ఆవరణలో సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయించడంతో పాటు పాఠశాలకు కొంత ఫర్నీచర్‌ను కూడా సమకూర్చారు. ఇంగ్లాండ్‌లో ఉన్న పాఠశాల పూర్వ విద్యార్థి ఒకరు ప్రతి ఏటా పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు పదివేల రూపాయలను అందిస్తున్నారు. మరో దాత సహకారంతో పదో తరగతిలో ప్రాజెక్టర్‌ను ఏర్పాటు చేసి డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి ఒకరు సహకారం అందించడంతో సైన్స్ ల్యాబ్ పాఠశాల ప్రకృతివనం రూపుదిద్దుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి తరగతికి డిజిటల్ బోర్డులను అమర్చడంతో సాధారణ బోధనతో పాటు డిజిటల్ బోధనకు అవకాశం కలిగింది. ప్రతి తరగతి గదిలోను డిజిటల్ బోర్డులు ఏర్పాటయ్యాయి. కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పాఠశాల

మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

పాఠశాలలో పరుచుకున్న పచ్చదనం

అభివృద్ధి కోసం పది లక్షల రూపాయలను విడుదల చేసింది. ఈ నిధులతో ప్రస్తుతం మరిన్ని మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ఎల్ఐసి ఫైనాన్స్ కార్పోరేషన్ వారి సహకారంతో బాల బాలికల కోసం సౌచాలయాలను నిర్మించారు. దాతల సహకారంతో పాఠశాలలో గ్రంథాలయం కూడా రూపుదిద్దుకుంది. పాఠశాల ప్రకృతి వనం ఏర్పాటుతో పాఠశాల రూపురేఖలు మారిపోయి మొక్కలకు కంచె ఏర్పాటు చేయడంతో పాటు వేసవిలో ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటూ నాటిన ప్రతి మొక్కను కాపాడుకున్నారు. పాఠశాలకు ఎవరైనా అతిథులు వచ్చినప్పుడు పేపర్ ప్లేట్లలో

మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

కాకుండా అరటి ఆకులలో భోజనం వడ్డిస్తున్నారు.

విద్యతో పాటు విలువలు: పాఠశాలలో విద్యుత్త పాటు మానవీయ విలువలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. భగవద్గీత, రామాయణం వంటి ఆధ్యా త్మిక అంశాలను విద్యార్థులకు నేర్పిస్తున్నారు. బాల సభల ఏర్పాటుతో విద్యార్థు ల్లోని సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు కృషి చేస్తున్నారు. క్రాఫ్ట్ టీచర్ సహకారంతో కుట్టు శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. దాతల సహకారంతో మూడు కుట్టు మిషన్లను ఏర్పాటు చేసి అమ్మాయిలకు కుట్టు నేర్చుకునేందుకు అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఆత్మవిశ్వాసం కోసం కరాటే క్రీడలు యోగా వంటి వాటిలో శిక్షణ ఇస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషిచేస్తున్నారు.

చాలా ఆశ్చర్యపోయాను: గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు తుమ్మల రజిత

నేను ఈ పాఠశాలకు ఇటీవల గజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు తీసుకున్నాను. పాఠశాలకు కావాల్సిన అన్ని వసతులు ఇక్కడ ఉన్నాయి. ముఖ్యంగా పాఠశాలల పరిసరాలు పచ్చదనంతో కళకళలాడుతూ ఎంతో ప్రశాంతతను ఇస్తున్నాయి. ఉపాధ్యాయు కృషి అభినందనీయం.

పాఠశాలకు గుర్తింపు...ఉపాధ్యాయుల కృషిని గుర్తించిన జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాలను సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పూర్వ విద్యాశాఖ అధికారి ఉషారాణి ప్రస్తుత విద్యాశాఖ అధికారి రవిందర్ తదితరులు పాఠశాలను సందర్శించి అభినందించారు. పాఠశాల విద్యార్థులు జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలతో పాటు ఎన్జీసీ కార్యక్రమాల్లో పాల్గొని సత్తా చాటారు. ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో బాలికల విభాగంలో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థికి విఐపి సంస్థ 5 వేల నగదుతో 20 వేల డిపాజిట్‌ను చేసేందుకు ముందుకు వచ్చింది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రత్యేకంగా ప్రచురించిన పుస్తకంలోనూ అప్పంపల్లి పాఠశాలకు చోటు దక్కింది. 2024 సంవత్సరానికి గాను రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసిన అప్పంపల్లి పాఠశాలకు దీనికోసం కృషి చేసిన తెలుగుభాష ఉపాధ్యాయుడు గుముడాల చక్రవర్తిగౌడ్‌కు గ్రీన్ ఛాంపియన్ అవార్డు ప్రకటించింది.

గ్రామస్తుల సహకారంతో...

కె.రవిశంకర్, ఎస్.ఏ గణితం జడ్పీహెచ్ఎస్, అప్పంపల్లి

నేను ఈ పాఠశాలలో 2011లో చేరాను. నేటికి పదమూడేళ్ల అనుబంధం ఈ పాఠశాలతో ఉంది. పాఠశాల అభివృద్ధి కోసం గ్రామస్తులు పూర్వ విద్యార్థులు ప్రజా ప్రతినిధుల సహకారాన్ని తీసుకున్నాము. పాఠశాలలో మౌలిక సదుపాయాల ఏర్పాటు అవసరాన్ని గ్రామ ప్రజల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు కూడా సంపూర్ణంగా సహకరించారు. గ్రామ సర్పంచ్‌తో పాటు ఎంపిటిసి, రైతు సమన్వయ కమిటి అధ్యక్షులు వార్డు సభ్యులు ఇతర ప్రజా ప్రతినిధులు పాఠశాల అభివృద్ధి కోసం తమ సొంత డబ్బులను విరాళంగా అందించారు. దీంతో పాఠశాలను అందంగా తీర్చిదిద్దగలిగాం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రత్యేకంగా 10 లక్షల రూపాయలను విడుదల చేసింది. ఆ పనులు కూడా పూర్తి కావస్తుంది.

మా బాధ్యతగా భావించాము : గుముడాల చక్రవర్తిగౌడ్

తెలుగు భాషోపాధ్యాయులు, అప్పంపల్లి

ఉపాధ్యాయుల సమిష్టి కృషితోనే పాఠశాల అభివృద్ధి సాధ్యమైంది. గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు పూర్వ విద్యార్థుల సహకారం సంపూర్ణంగా లభించడంతో మౌలిక సదుపాయాలు ఒక్కొక్కటిగా సమకూర్చగలిగాము. పర్యావరణ పరిరోణ ఒక బాధ్యతగా స్వీకరించి ప్రణాళిక బద్ధంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఇప్పుడు పాఠశాల పరిసరాలన్ని పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఉపాధ్యాయులు బోధనలో ఒత్తిడికి గురైన పాఠశాల వాతావరణం వారిలో మానసిక ప్రశాంతతను చేకూరుస్తుంది. గ్రామ ప్రజలు పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు సహకారం అందిస్తే ప్రతి ప్రభుత్వ పాఠశాల ఆదర్శ పాఠశాలగా రూపుదిద్దుకుంటుంది.

నియోజకవర్గ స్థాయి క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపికలు విజయవంతం చేయండి

మక్తల్ రూరల్,జూన్ 18 ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ శిక్త పట్నాయక్, డివైఎస్ఓ వెంకటేష్ శెట్టి ఆదేశాల మేరకు, ఈనెల 21న ఉదయం 9 గం.లకు మక్తల్ మిని స్టేడియం మైదానంలో మక్తల్ నియోజకవర్గ స్థాయి క్రీడా పాఠశాలలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వెంకటయ్య, నిర్వహణ కార్యదర్శి విశ్రాంత పీఈటీ బి. గోపాలం మంగళవారం విలేఖరుల సమావేశంలో తెలిపారు. నియోజకవర్గస్థాయి క్రీడా పాఠశాల ఎంపికలను స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభిస్తారని వారు తెలిపారు. నియోజకవర్గంలోని కృష్ణ, మాగనూరు, మక్తల్, నర్వ, ఉట్కూర్ మండలాలలో ప్రభుత్వ, ప్రైవేట్ ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాల బాలికలు 01.09.2015నుండి 31.08.2016 మధ్య జన్మించిన బాల బాలికలు క్రీడా పాఠశాలకు ఎంపికలకు అర్హులని వారు తెలిపారు. ఈ క్రీడా పాఠశాల ఎంపికలలో పాల్గొనే బాల బాలికలకు ఎత్తు, బరువు, స్టాండింగ్ జంప్, 30 మీటర్ల పరుగు, మెడిసిన్ బాల్ త్రో, 6 10 సెటిల్ రన్, వర్టికల్ జంప్, ఫ్లెక్స్ బిలిటి, 800 మీటర్ల పరుగు నిర్వహించి, క్రీడా నైపుణ్యతను ప్రదర్శించిన వారిని ఈ నెల 29న జిల్లాలో జరిగే జిల్లాస్థాయి క్రీడా పాఠశాల ఎంపికలకు పంపుతామని వారు తెలిపారు. ఈ ఎంపికలను ఈ నెల 21న మక్తల్ మిని స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తామని ప్రతి పాఠశాల నుండి ఎత్తయిన ముగ్గురు బాలికలు, ముగ్గురు బాలురు బోనఫైడ్‌తో పాల్గొనాలని వారు తెలిపారు. ఈ క్రీడా పాఠశాలల ఎంపికలలో పాల్గొనే బాల బాలికలు ఈనెల 21న ఉదయం 9 గం.లకు మక్తల్ మిని స్టేడియంలో విశ్రాంత పీఈటి, బి. గోపాలం దగ్గర రిపోర్టు చేయాలని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, హెచ్ఎం అనిల్‌గౌడ్, విశ్రాంత పీఈటీ గోపాలం, పీఈటీలు అమ్రేష్, దామోదర్, రమేష్, అల్తాఫ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటయ్య

ఖచ్చితమైన ప్రణాళికతో ముందుకు సాగాలి

- ఎస్సి డిడి వి. పాండు, డైరెక్టర్ కాడం శ్రీనివాస్
- గ్రూప్ 1 అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్18 ప్రభాతవార్త: మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా జికె(లూసెంట్), పాలిటి (లక్ష్మీకాంత్), క్వాంటిటీటివ్ యాటిట్యూడ్ (ఆర్ ఎస్ అగర్వాల్), ఎకానమీ (చిరంజీవి), సోషియాలజీ (శ్రవణ్), తెలంగాణ మూమెంట్ (పిఎన్ఆర్), అండ్ టీఎస్పీఎస్సీ ప్రీవియస్ మోడల్ పేపర్స్ పుస్తకాలను డిడి (ఎస్సిడిడి) పాండు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కాడం శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ పోటీ తీవ్రంగా ఉన్నందున ఖచ్చితమైన ప్రణాళికతో శ్రమిస్తేనే ఉద్యోగం సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ ఫ్యాక్టరీ గిరింద్రచారి, లచ్చయ్య, రామిరెడ్డి, స్టడీ సర్కిల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న అధికారులు

వనపర్తి ఎప్పటికీ నా గుండెల్లో ఉంటుంది

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కరూ ప్రజలకు అత్యున్నత స్థాయి సేవలు అందించాలని సూచించారు. ప్రతి అధికారి నిత్యం ఎంత మందికి సేవ చేస్తాం ఇంకా ఎంత మందికి చేయాలనే సంకల్పం కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజా సేవ చేసే అవకాశం పొందిన మనం ఎక్కడి నుంచి వచ్చాము, ఇంకా గమ్యాన్ని చేరుకునేందుకు ఎంత దూరం ప్రయాణించాలనే విషయాల్ని గుర్తుచుకోవాలన్నారు. అపదలో ఉన్న వ్యక్తికి మనం తప్ప అతన్ని ఆదుకోవడానికి ఎవరూ లేరు అని భావించి సేవ చేయాలన్నారు. ఐ.ఏ.ఎస్ అధికారిగా ప్రజలకు సేవ చేసే అవకాశం చాలా తక్కువ మందికి వస్తుందని అలాంటి అవకాశం తనకు వచ్చినందుకు ఎంతో గొప్పగా భావిస్తున్నానన్నారు. జిల్లా కలెక్టర్ గా వనపర్తికి వచ్చిన తర్వాత పరిపాలనలో ఇక్కడి అధికారులు సహాయ సహకారాలు అందించారని తెలిపారు. వనపర్తి జిల్లా ప్రజలకు సేవ భాగ్యం దక్కినందుకు చాలా గొప్పగా భావిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తులో తాను ఎక్కడ ఉన్నా వనపర్తి జిల్లా తన గుండెల్లో ఉంటుందని కంట తడి పెట్టుకున్నారు. అనంతరం అన్ని శాఖల జిల్లా అధికారులు, తమ సిబ్బందితో కలిసి కలెక్టర్ దంపతులకు పూల బొకేలు ఇచ్చి శాలువతో సత్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం నగేష్, అదనపు ఎస్పీ రామదాసు, జడ్పీసీఈఓ యాదయ్య, టీజీఓ అధ్యక్షులు సురేష్, టీఎన్జీఓ అధ్యక్షులు అశోక్, ట్రెసా అధ్యక్షులు మల్లిఖార్జున, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సన్మానం చేసిన ఉన్నతా జిల్లా అధికారులు

నాడు మాట ఇచ్చి.. నేడు నెరవేర్చి

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాల్లో, కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు పాఠశాలల్లో కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థుల సైజు ఆధారంగా షూస్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో జడ్చర్లలోనే మొదటిదని అన్నారు.

ఆన్‌లైన్ టోకెన్ ద్వారా ఇసుక అందజేస్తాం..

అయ్యవారిపల్లి వద్ద సీజ్ చేసిన ఇసుకను పేదలకు అందజేస్తామని, ఆన్‌లైన్ టోకెన్ ద్వారా జడ్చర్ల వాసులకు ఇసుక అందజేస్తామన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక అక్రమార్కులు లక్షల్లో కోట్లు సంపాదించారని, తనకు గాని, కాంగ్రెస్ కార్యకర్తలకు గాని అక్రమాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. సొంత పార్టీ కార్యకర్తలు అవినీతికి పాల్పడ్డా కూడా ఉపేక్షించమని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయిస్తామని తెలిపారు. గత నెలలో జరిగిన ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15 తారీకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఖచ్చితంగా జరుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తామని తెలిపారని అన్నారు. ఇంతకు ముందులాగాప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఎలాగైతే విద్యనభ్యసించేవారు ఆ విధంగానే పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈవారం రోజులలో పాఠశాలలో తన స్నేహితుల సహకారంతో 20మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే 20టీవీలు కూడా తెప్పించాము. ఎన్నికల కోడ్ ఉండడం వల్ల అవి పాఠశాలలో అమర్చలేకపోయాము. తొందరలోనే ఆటీవీలను పాఠశాలలో అమర్చి విద్యార్థులకుఇంగ్లీష్ నేర్చుకోవడానికి, ఆన్‌లైన్ క్లాసులు వినడానికి ఉపయోగపడేలా చేస్తామని అన్నారు.

అధికారులే తప్పుడు నివేదికలు....

రంగారెడ్డిగూడ పరిధిలోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమ వల్ల కాలుష్య ఏర్పడుతుందని తాను కంపెనీని మూసివేయడం జరుగుతుందని తెలపడంతో ఆ కంపెనీ నుంచి మామూలు తీసుకునేవారు దుష్ప్రచారం చేసి మొన్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయించుకునే ప్రయత్నం చేశారని ఎమ్మెల్యే తెలిపారు. రంగారెడ్డిగూడెంలో కూడా కాంగ్రెస్‌కు లీడ్ వచ్చిందని ఒక రెండు బూతుల్లోనే లీడ్ రాలేదన్నారు. స్పాంజ్ ఐరన్ పరిశ్రమపై అధికారులే పొల్యూషన్ లేదు. 33% బిలో ఉందని రిపోర్టు ఇచ్చారని, ఈ విషయంపై తాను ఉన్నతాధికారులకు మంత్రి వర్గానికి తెలియజేయునట్లు పేర్కొన్నారు. సెజ్‌లోని హెటిరో, అరబిందో లాంటి కంపెనీల నుంచి కూడా పొల్యూషన్ వెలువడుతుందని, కానీ కొందరు అధికారులు లంచాలు తీసుకుని తప్పుడు నివేదికలు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై తాను నూతన కలెక్టర్‌కు కూడా విన్నవించనున్నట్లు తెలిపారు. ఉదండాపూర్ వాసులు బిజెపి నేతలు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా తీసుకొస్తామని చెప్పి ఉదండాపూర్ వాసులతో ఓట్లు వేయించుకున్నారని, ఇచ్చిన మాట ప్రకారం పాలమూరుకు జాతీయ హోదా తీసుకురావాలని డిమాండ్ చేశారు. జడ్చర్లలో ప్రభుత్వ దవాఖానాలో 100 బెడ్ సౌకర్యం కల్పిస్తామని, త్వరలోనే వైద్యులను, సిబ్బందిని నియమించి దవాఖానాను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. 200 యూనిట్లలోపు బిల్లులు కట్టాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాటు జడ్చర్లలోను పథకం అమలులో కొంత ఆలస్యం జరిగిందన్నారు. తాను విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించి 200 యూనిట్ల లోపుఅర్హులందరికి పథకంఅమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి, నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, చైతన్యచౌహాన్, రాజు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్

బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపిన ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 18 ప్రభాతవార్త: మహబూబ్‌నగర్‌లో నూత